## పోలీస్ అధికారిగా.. చిన్నారి

### మేక్ ఏ విష్ ఫౌండేషన్ చొరవ

### తీరిన క్యాన్సర్ బాధిత బాలుడి కోరిక

బంజారాహిల్స్, డిసెంబర్ 15: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడు ఒక్కరోజైనా పోలీసు అధికారిలాగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని ఉన్నదని ఆకాంక్షను వ్యక్తపరిచాడు. దీంతో ఈ విషయాన్ని 'మేక్ ఏ విష్ ఫౌండేషన్' ప్రతినిధులు తెలుసుకుని బంజారాహిల్స్ పోలీసులను సంప్రదించగా, శుక్రవారం బాలుడిని పీఎస్‌కు తీసుకువెళ్లి అతడి ఆకాంక్షను నెరవేర్చారు. గుంటూరు జిల్లాకు చెందిన అనుపోజు బ్రహ్మం, లక్ష్మి దంపతుల కొడుకు మోహన్ సాయి(7) ఏడాది కిందట క్యాన్సర్ బారిన పడ్డాడు. ఏడాది కాలంగా బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకు పోలీస్ కావాలని ఉందంటూ.. తరచూ తల్లిదండ్రులకు చెప్పేవాడు. దీంతో 'మేక్ ఏ విష్' ప్రతినిధులు బాలుడిని శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీస్ డ్రెస్‌లో పీఎస్‌కు వచ్చిన మోహన్ సాయిని బంజారాహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ స్వాగతం పలికాడు. తన సీటు మీద కూర్చోబెట్టడంతో బాలుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యక్రమాల గురించి అడ్మిన్ ఎస్ఐ శివశంకర్, ఎస్ఐ రవీందర్ తదితరులు మోహన్ సాయికి వివరించారు.



బంజారాహిల్స్ పీఎస్‌లో మోహన్ సాయితో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్

## 'లూలూ'లో మిల్లెట్స్ ఫెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 15 : కేపీహెచ్‌బీకాలనీలోని లూలూ మాల్‌లో మిల్లెట్స్ ఉత్సవం కోలాహలంగా సాగుతున్నది. ఈ మిల్లెట్స్ ఫెస్ట్‌లో సంప్రదాయ, రుచికరమైన మిల్లెట్స్ వంటకాలతో కూడిన లైవ్ వంట కౌంటర్లను అందుబాటులో ఉంచారు. ఈనెల 17 వరకు ఈ ఉత్సవం కొనసాగుతుందని.. ఆసక్తి ఉన్న వారు పాల్గొని విజయవంతం చేయాలని లూలూ మాల్ నిర్వాహకులు కోరారు.

## *శివాని సందడి*




మాదాపూర్‌లో శుక్రవారం సినీ నటి శివాని రాజశేఖర్ ఓ మొబైల్ హ్యాండ్ సెట్ ఆవిష్కరణలో పాల్గొని సందడి చేశారు. *-మాదాపూర్, డిసెంబర్ 15*

## హైటెక్స్‌లో 22 నుంచి 'కిడ్స్ ఫెయిర్'




బ్రోచర్ ఆవిష్కరణలో నిర్వాహకులు, హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ శ్రీకాంత్ తదితరులు

మాదాపూర్, డిసెంబర్ 15: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 22 నుంచి 24 వరకు కిడ్స్ ఫెయిర్ 2023 నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ శ్రీకాంత్ శర్మాజీ ఎవెన్యు వెంచర్స్ మనస్విని బండి, వైస్ ప్రెసిడెంట్ స్మిత చౌదరి కంకణాల, కంటినెంటల్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జీవని గద్దె, ప్యూచరిస్ట్ ఎడ్యు ఇన్‌స్టిట్యూట్ ఇనిషియేటివ్స్ డైరెక్టర్ అఖిల భూపతి రాజు, లైఫ్ స్పాన్ ప్రై.లిమిటెడ్ సీఎండీ నరేంద్ర రామ్, జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్, హైదరాబాద్ రన్నర్స్ మధుసూదన్‌తో పాటు నటి ప్రగ్యా నయన్‌లతో కలిసి హాజరయ్యారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 100కు పైగా స్టాళ్లు అందుబాటులో ఉండగా డెకాథ్లాన్, జాకీ ఇండియా, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్, న్యారా ఉత్పత్తులు, గేమ్ పాయింట్, మెయిన్ స్ట్రీట్ కిడ్స్, కిమ రోబోటిక్స్, లిటిల్ ఒటర్స్, మ్యాప్, మ్యాజిక్స్ బాక్స్, పలు క్రీడలతో పాటు అక్షయ కల్ప ఆర్గానిక్, ఇండిక్ రూట్స్ లైఫ్‌స్టైల్, మాంచెస్టర్, గ్లోబల్ స్కూల్ ఎగ్జిబిటర్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# తెలుగు జాతి గర్వించదగిన వ్యక్తులు బాపు రమణ



ఏలే లక్ష్మణ్‌కు, మాఢభూషి దివాకరబాబుకు పురస్కారాలను ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 15. తెలుగు జాతి గర్వించదగిన గొప్ప వ్యక్తులు బాపు రమణలని వక్తలు కొనియాడారు. బాపురమణ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తులో శుక్రవారం బాపు జయంతి సందర్భంగా 2023 సంవత్సరానికి బాపు రమణల పేరిట నెలకొల్పిన పురస్కారాలను ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ ఏలే లక్ష్మణ్, ప్రముఖ రచయిత మాఢభూషి దివాకరబాబుకు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అలాగే మధుర స్నేహ పురస్కారాలను చిత్రకారులు ఖరీదేహల్ వెంకట భీమారావు, రచయిత కల్లూరి సత్యరామ ప్రసాద్‌లకు అందజేశారు. ప్రముఖ రచయిత, నటులు తనికెళ్ల భరణి రచించిన శివ చిలుకలు, ముళ్లపూడి వెంకటరమణ రచన బుడుగు, సత్యమూర్తి కార్టూన్ల పుస్తకం రామసోము, ప్రసాద్ కార్టూన్స్ రచన కార్టూన్ కాజాలు పుస్తకాలను ఈ సందర్భంగా వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత తనికెళ్ల భరణి, దర్శకులు రేలంగి నరసింహారావు, రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ, నటులు డాక్టర్ సుధర్శన్,రాజీవ్ కనకాల, చిత్రకారులు ఆనంద్ గడప, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి జయిస్తేనే...ఉన్నత స్థాయికి..



కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 15: ప్రతి రంగంలోనూ ఒత్తిడి ఉంటుందని...దానిని తట్టుకుని ముందుకెళ్లినవారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని గుజరాత్ వర్సిటీ పీఈడీ డైరెక్టర్ సుందర్ మనోహర్ అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూలో యూజీసీ ఆడిటోరియంలో ఐసీఎస్‌పీఈడబ్ల్యూ, ఐఎస్ఎంఎ, జేఎన్‌టీయూ మేనేజ్‌మెంట్ కాలేజీల సంయుక్తాధ్వర్యంలో ఐసీఎస్‌పీఈడబ్ల్యూ -2023 రెండు రోజుల సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుజరాత్ వర్సిటీ పీఈడీ డైరెక్టర్ సుందర్ మనోహర్, జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, వికో బయోటెక్ ఎండీ తుమ్మరి మురళి, ఉస్మానియా మాజీ డీన్ కె.రామచంద్రరెడ్డి, హుప్ కాలేజీ అమెరికా ప్రతినిధి మార్కస్ ఫీలా, ఐఎస్ఎంఎ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు మరో అవకాశం

మేడ్చల్, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం మరోసారి కల్పించింది. త్వరలోనే జరగనున్న పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటు హక్కు నమోదు ప్రక్రియను ప్రారంభించింది. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. ఓటు హక్కు పొందేందుకు 18 ఏండ్లు నిండిన వారు 6 ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు నమోదు ప్రక్రియ అనంతరం జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించి ఫిబ్రవరి 8న తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనున్నది. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు అభ్యంతరాలను స్వీకరించే అవకాశం కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 28,19,067 ఓటర్లు ఉండగా కొత్తగా ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించడంతో జిల్లాలో మరింత ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది.

## వస్తు సంస్కృతి, జానపద కళలను కాపాడుకోవాలి

### తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు, రిజిస్ట్రార్ భట్టు రమేశ్



వివిధ ఆకృతులను పరిశీలిస్తున్న తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు తదితరులు

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గిరిజన వస్తు సంస్కృతి, జానపద విజ్ఞాన కళలను ధ్వంసం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని తెలుగు యూనివర్సిటీ వీసీ టి.కిషన్‌రావు, రిజిస్ట్రార్ భట్టు రమేశ్ అన్నారు. ఆద్యకళ సంస్థ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు ఆధ్వర్యంలో గోండు వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు నిర్వహించే 'కాడెల్ ఫెస్ట్ హైదరాబాద్ సంబురాలు -2023' కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులుగా వీసీ, రిజిస్ట్రార్‌లు హాజరై శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ...మూలాల నుంచి వస్తున్న సంస్కృతిని కాపాడుకోవాలని, వస్తు సంస్కృతిని విద్యార్థులకు, పరిశోధకులకు, భవిష్యత్ తరాలకు అందజేసే బాధ్యత మనదేనని చెప్పారు. ఆద్యకళ ఫౌండర్ ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు, జర్మనీలోని నట్టింగం ట్రెంట్ వర్సిటీ ప్రొఫెసర్ నికోల్ ధిమోర్, ఫ్రాన్స్‌లోని పాల్ వెలిరో మాంటో పిల్లర్ వర్సిటీ ప్రొఫెసర్ జోదిత్ బరాఖ్ మాట్లాడుతూ.. జానపద గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు చర్చలు, ప్రదర్శనలు, పరిశోధనలు జరపాల్సిన ఆవశ్యకత ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సెటిల్డ్ ఆన్ ది ట్రైబల్ అండ్ దలిత్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్' అనే అంశంపై గోండు కళాకారుల సంగీత విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్లు గిరిజ, టి.విజయ్‌కుమార్, కె.సత్యనారాయణ, ప్రముఖ పరిశోధకుడు ఎంఎన్ శ్రీనివాసన్‌తో పాటు ఆదివాసీ పరిశోధకులు గుంజాల గోండి లిపి తొడ్సం దేవ్‌రావ్, మేస్రం దుర్గు, కుమ్రం మోహన్, పీహెచ్‌డీ స్కాలర్స్ బి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న గిరిజన వస్తు సంస్కృతి ప్రదర్శన..

ఆద్యకళ ద్వారా ఏర్పాటు చేసిన ఆదివాసీ వస్తు సంస్కృతి ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నది. 7 ఉంచి 12 మెట్ల కిన్నెర, చుముకి వాద్య పరికరాలు, నగారా, చిట్కీ మిట్కీ (లవ్ బర్డ్స్), హౌనం, డమరుకం, జమిడిక, జముకు, డిమ్కి, చెక్కతోనే తయారు చేసిన దంపుడు రోళ్లు, పొలాల పండుగకు పశువులను అలంకరించే జీల-శిర్ల, సంగీత వాద్య పరికరాలు (అనేక ధ్వనులు వినిపించే పరికరం), తదితర అరుదైన వస్తువులు ఆద్యకళలో కొలువుదీరాయి.

## ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా..

## 21న చలో ఢిల్లీ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 15: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా 21న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్ తెలిపారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ఈ మహాధర్నా కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమం జయప్రదం కోసం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఎల్.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకట్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వరిగడ్డి చందు, నాయకులు జన్నారపు జీవన్, ధర్మారం శ్రీకాంత్, కానుగంటి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 100 కంపెనీలు..

## 10 వేల ఉద్యోగాలు

### నేడు జేఎన్టీయూలో మెగా జాబ్‌మేళా

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 15 : జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి కోరారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, సేవా ఇంటర్నేషనల్ సంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మెగా జాబ్‌మేళాలో 100 ప్రముఖ కంపెనీలు హాజరవుతాయని.. 10వేల ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, ఆల్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ 2016 నుంచి 2023 వరకు ఉత్తీర్ణులైన వారంతా అర్హులు. ఐటీ, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, ఫార్మా, కోర్, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాను వర్సిటీతో పాటు అన్ని కళాశాలలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని యూఐఐసీ డైరెక్టర్ తారాకల్యాణి, డిప్యూటీ డైరెక్టర్ సురేశ్‌కుమార్ కోరారు.